

చల్లమ్మో.. చల్ల..!


ప్రజాశక్తి- సోమల: భోగి పండుగ సందర్భంగా సోమల పంచాయతీ భారతం మిట్ట, వడ్డిపల్లి గ్రామాలలో చిన్నారులు ఉదయం 6 గంటలకే ప్రతి ఇంటికీ వెళ్లి చల్లమ్మో.. చల్ల.. అంటూ ఆకులలో ఆహారాన్ని పెట్టించుకున్నారు. ప్రతి సంక్రాంతి పండుగ ముందురోజు వచ్చే భోగి పండుగ రోజు ఇలాంటి ఆచారం గ్రామంలో ఉంది. రాత్రి మిగిలిన అన్నం పెరుగు కలిపి చిన్నారులకు చల్ల పోయడం చేస్తూ ఉంటారు. సద్ది అన్నం తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పూర్వీకుల కాలం నుండి ఇలాంటి ఆచారాన్ని నిర్వహిస్తూ వస్తున్నామని గ్రామస్తులు తెలిపారు.



చల్ల పోయించుకుంటున్న చిన్నారులు

నారావారిపల్లెలో సంక్రాంతి సందడి

పలు అభివృద్ధి కార్యాక్రమాలకు శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి



మహిళా ఆటో డ్రైవర్లకు ఆటోలను అందజేస్తున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి): నారావారిపల్లెలో సోమవారం ఉదయం భోగి పండుగ సంక్రాంతి సంబరాల సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటలపోటీల కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనవడు దేవాన్ష్ పిల్లలతో కలిసి అందరిని ఉత్తేజపరుస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. నారా అలాగే గ్రామ మహిళలు సంప్రదాయకరమైన పాటలను పాడుతూ అందమైన ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించిన పోటీలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి, బాలక్రిష్ణ భార్య వసుందర, వారి కుటుంబ సభ్యులు తిలకించారు. అనంతరం క్రీడాపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. వీరితోపాటు చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, చంద్రగిరి, పలమనేరు, నగరి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, అమర్నాథరెడ్డి, గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యాక్రమాలకు శంకుస్థాపనలు


ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగు పథకం ద్వారా నారావారిపల్లిలోని రైతులు బలరాం నాయుడు, జ్యోతిలకు డ్రిప్ పరికరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు. ఏపీఎంఐపి ప్రాజెక్టు కింద అర్హులైన అందరిని కవర్ చేయాలని సిఎం సూచించారు. అలాగే సుమారు రూ. 4.27కోట్లతో నిర్మించనున్న 33/కెవి సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్‌కు శిలాఫలకం ఆవిష్కరించి శంఖుస్థాపన చేశారు. ప్రతి ఇంటికి సోలార్ ప్యానల్ ఏర్పాటుతో కవర్ చేయాలని సూచించారు. అలాగే జాతీయ ఉపాధి హామీ పథకం కింద నారావారిపల్లి గ్రామపరిధిలోని మూడు సచివాలయల పరిధిలో 26 అభివద్ధి పనులు రూ.3.21కోట్ల పనులకు శిలాఫలకం ఆవిష్కరించారు. ఎ.రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్టేట్ ఆఫ్ ఆర్ట్ కింద ఆదర్శవంతమైన పాఠశాలగా శ్రీసిటీ సౌజన్యంతో రూ.1.10 కోట్లతో అభివద్ధి చేయుటకు పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఐఎఫ్‌పి ప్యానెల్స్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, ఎఐ రోబోటిక్ ల్యాబ్, క్రీడా సామాగ్రి మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులకు శంఖుస్థాపన చేశారు. అలాగే నారావారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 8అంగన్వాడీ కేంద్రాలలోని ఐదేళ్ల లోపు పిల్లలకు మంచి భవిష్యత్తును అందించడానికి ఒక ప్రాజెక్టుకు ఏంఓయును సంతకం చేశారని తెలిపారు. సదరు కేర్ అండ్ గ్రో ద్వారా కుప్పంలో 480 సెంటర్లలో అంగన్వాడీ కార్యకర్తలకు సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు నిర్వహిస్తూ, పిల్లల మానసిక, శారీరక, విద్యాపరమైన అంశాలలో మెరుగ్గా ఫలితాలు వచ్చేలా చేపట్టిన చర్యలు, తల్లులతో సమావేశాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించే ఈ కార్యక్రమం కుప్పంలో మంచి ఫలితాలు ఇస్తోందని ఇక్కడ కూడా మంచి ఫలితాలు రావాలన్నారు. గ్రామీణ మహిళలు ఇంటి వద్ద నుండే కిరాణా షాపులకు వస్తువులను సరఫరా చేసి తద్వారా వారి ఆర్థిక స్థితి గతులు మార్చుకునే విధంగా సౌలభ్యం కల్పించడానికి ఈజిమార్ట్ డిఆర్డిఎ వెలుగు సంస్థ మధ్య ఒప్పంద సంతకం చేసి ఎంఓయులు మార్పిడి చేసుకోవడం జరిగిందని తెలిపారు. నారావారిపల్లి సమీపంలోని 5 గ్రామాల 200మంది మామిడి రైతులతో ఎఫ్‌పిఓ ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ పత్రాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా వారికి అందజేయడం జరిగింది. ప్రభుత్వ స్కీంల వినియోగంతో ఇన్ఫ్రాస్ట్రక్చర్, మార్కెటింగ్ అనుసంధానంతో బిగ్ బాస్కెట్, రిలయన్స్, ప్రాసెసింగ్ యూనిట్లకు నేరుగా మార్కెటింగ్ చేసుకోవడం వలన మధ్యవర్తులు లేకుండా కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని ప్రైమరీ ప్యాకింగ్ అండ్ గ్రేడింగ్ చేసుకుని నేరుగా వారు అమ్ముకునేందుకు ఈ ఎఫ్పీఓ ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవాలని సిఎం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏపీఎంఐపి అధికారి సతీష్, సిఎండి ఏపీ ఎస్పీడీసీఎల్ సంతోష్ రావు, పిడి డ్వామా శ్రీనివాస ప్రసాద్, జిల్లా మహిళ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, కేర్ అండ్ గ్రో ఫౌండర్ డాక్టర్ మేఘన, డిఆర్‌డిఏ వెలుగు పీడీ శోభన్ బాబు, ఈజీమార్ట్ ఫౌండర్ అండ్ సీఈఓ వెంకట్ నల్లపాటి, జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథ రామిరెడ్డి పాల్గొన్నారు.



నారావారిపల్లెలో చిన్నారులతో సంక్రాంతి సంబరాలు

చలించిన బాబు...

పెన్షన్ మంజూరు చర్యలకు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించిన ముఖ్యమంత్రి



వెంటనే పింఛను ఇప్పించాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్న సిఎం

తిరుపతి బ్యూరో: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని నారావారి పల్లిలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి ఇంటి వద్దకు వస్తున్న సీఎం చంద్రబాబు వృద్ధ దంపతులను చూసి చలించిపోయి వారికి పెన్షన్ అందించేందుకు భరోసా ఇస్తూ మరోసారి మానవత్వం చాటుకున్నారు. సిఎం వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎక్కడి నుండి వచ్చారు.. సమస్య ఏంటని అడిగారు. తన పేరు బి. నాగరాజమ్మ (62) భర్త సుబ్బరామయ్య అని, భీమవరం గ్రామం చంద్రగిరి మండలం అని పక్షవాతంతో సుమారు 5 సంవత్సరాల నుండి బాధపడుతున్నానని, నడవలేక పోతున్నానని, దివ్యాంగ పెన్షన్ ఇవ్వాలని విన్నవించుకోగా వెంటనే పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భోగి పండుగ పురస్కరించుకొని ప్రజలందరూ పాత వస్తువులను భోగి రూపంలో దగ్ధం చేసి కొత్త వెలుగులు కోసం ఎదురుచూస్తారు. ఆ విధంగా విద్యుత్ చార్జీలను పెంచకూడదని విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దగ్ధం చేసే కార్యక్రమం విస్తృతంగా చేయాలని సిపిఎం జిల్లా కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా 25 చోట్ల దగ్ధం చేసే కార్యక్రమం చేసినట్టు సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చిత్తూరు, బంగారుపాళ్యం, పూతలపట్టు, పలమనేరు, గంగవరం, పుంగనూరు, నగరి, నింద్ర, తదితర ప్రాంతాల్లో సిపిఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ప్రజలతో కలిసి విద్యుత్ బిల్లులను భోగి మంటలో వేసి నిరసన తెలిపినట్లు తెలిపారు. అదనపు విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలను యధాతరంగా ఉంచుతున్నట్లు చూపారని అయితే ప్రతి నెలా వసూలు చేస్తున్న 40 పైసలు 2025- 26 లో రద్దు చేస్తున్నట్లు స్పష్టంగా ఎక్కడ చెప్పలేదని అన్నారు. 2025- 26 సంవత్సరంలో ప్రజలపై భారం ఉంటుందని స్పష్టంగా అర్థం అవుతున్నదని, 2025-26 సంవత్సరానికి రెవెన్యూ గ్యాప్ 5538కోట్లు చూపించారని, ఈ మొత్తాన్ని ఛార్జీల రూపంలో వసూలు చేయాలనేది స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నారు. ఈ భారం ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. టైం ఆఫ్ డే విధానాన్ని సిపిఎం వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. రోజుకు 24 గంటలలో పీకవర్స్ ఎనిమిది గంటలు ఆఫ్ పీకావర్స్ 11 గంటలు నార్మల్ అవర్స్ 5 గంటలు అని చెప్పి విభజన చేసి సామాన్యులు వాడే సమయంలో కరెంటుకు అదనంగా డిస్కమ్ వసూలు చేయడానికి ప్రతిపాదించడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రతిపాదనను రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ డే టారీకు విధానాన్ని అమలు చేయటం, ఛార్జీలు వసూల్లో పారదర్శకత లేకపోవడం ప్రిపైడ్ విధానాన్ని కలిగి ఉండడం తదితర కారణాల రీత్యా స్మార్ట్ మీటర్‌లను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గిరిధర్ గుప్తా, ఓబుల్ రాజు, మురళి, ఈశ్వరయ్య, రాజా, జయంతి, జ్యోతి, వినోద్, పెరుమాళ్, సంతోష్, చిరంజీవమ్మ, రమణ, నగరిలో జగదీష్, షణ్ముగం, కాలతి, అయ్యప్పన్, ధనపాల్ పాల్గొన్నారు.



పలమనేరులో..



నగరిలో..



వికోటలో..



పూతలపట్టులో..

అట్టహాసంగా సంక్రాంతి సంబరాలు



తవణంపల్లిలో గల్లా కుటుంబం

ప్రజాశక్తి- తవణంపల్లి: మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి స్వగ్రామం చిత్తూరు జిల్లా దిగువమాఘం గ్రామం లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం తెల్లారి జామున భోగి వేడుకల్లో గల్లా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రతిఏటా సొంత ఊరిలో గ్రామస్తులతో కలసి తమ కుటుంబ సభ్యులందరం సంక్రాంతి సంబరాలు జరుపుకుంటామని గల్లా అరుణకుమారి తెలిపారు. అనంతరం సినిమా హీరో గల్లా అశోక్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఏటా స్వగ్రామమైన దిగువ మాఘంలో కుటుంబ సభ్యులతో కలసి సంక్రాంతి పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతుందని అందరితో కలిసి పండుగ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే యూత్‌కు ఆకర్షించే విధంగా సితార ప్రొడక్షన్లో కొత్త సినిమా రిలీజ్ అవుతుందని తెలిపారు. తన మేనమామ మహేష్ బాబు ఆశీస్సులు ఎల్లవేళలా తనపైన ఉంటుందని కొత్తగా రానున్న కొత్త సినిమాను అందరూ ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గల్లా అరుణకుమారి వారి కుటుంబ సభ్యులు గ్రామస్తులతో కలిసి కోలాటం, గొబ్బియల్లు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో అమర రాజా అధినేత గల్లా రామచంద్ర నాయుడు, మాజీ ఎంపీ జిల్లా జయదేవ్, గౌనినేని రమాదేవి, గౌరినేని హర్ష విక్రమ పాల్గొన్నారు.

మండలంలో ఘనంగా భోగి పండుగ

సోమల: భోగి పండుగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఉదయం 5 గంటల నుండే ప్రజలు తమ ఇళ్ళ ముందు భోగి మంటలు వేసి ఆనంద ఉత్సాహాల మధ్య భోగి పండుగను జరుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు, వృద్ధులు, మహిళలు అందరూ ఇంటిలోని పాత వస్తువులను తెచ్చి ఇంటి ముందర వేసి వాటికి నిప్పు అంటించి భోగిమంటలు వేసి భోగి పండుగ నిర్వహించుకున్నారు. యువకులు పండుగ సందర్భంగా శరీరం మొత్తం నూనె రాసుకుని అనంతరం తలంటు పోసుకున్నారు. నూతన వస్త్రాలు ధరించిన చిన్నారులు వీధులలో సందడి చేశారు. మహిళలు ఇండ్ల ముందు రంగవల్లులు దిద్ది అందంగా రంగులు వేశారు. చిరుజల్లులు పడుతూ ఉన్న లెక్కచేయకుండా అందరూ భోగి పండుగను నిర్వహించుకున్నారు.

ఎమ్మెల్యే గురజాల ఇంట...

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్వగృహంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగను ఉత్సాహంగా జరుపుకొన్నారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా భోగి మంటలను వేశారు. అనంతరం గంగిరెద్దుకు ధాన్యం తినిపించారు. కొత్త కుండలో పొంగళ్లు పెట్టి దేవుడికి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



బంగారుపాళ్యంలో..

సంక్రాంతి కాంతులేవి..?

గంగాధరనెల్లూరు: ఒకప్పుడు సంక్రాంతి పండుగ అంటే అంతులేని ఆనందం.. వరుసగా నాలుగు రోజులు పాటు సాంప్రదాయ పద్ధతులతో పండగ చేసుకునేవారు.. కారణాలు ఏవైనా కావచ్చు... క్రమేనా పండుగ సందడి తగ్గింది. సాంప్రదాయాలు కనుమరుగగుతున్నాయి. హరిదాసుల హరినామ సంకీర్తనలు వినిపించడం లేదు. ఇక డూ.... డూ... బసవన్నల జాడే లేదు.. ముత్యాల ముగ్గులు (రంగువల్లులు) ఆవు పేడతో గొబ్బెమ్మలను తీర్చిదిద్దడం తగ్గింది. పోటీలు పడి ముగ్గులు వేయడం తగ్గిపోయింది. ప్రతి గ్రామ పొలిమేరలో తంగేడు పూలు, నల్లేరు, పిండిపూలు, మామిడి ఆకులతో తోరణాలు వేసి తోరణాలుగా ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు చాలా పల్లెల్లో ఈ పూల చెట్లు లేవు ఇక సంక్రాంతి సందర్భంగా సాంప్రదాయ పద్ధతిగా జల్లికట్టు నిర్వహించేవారు.



దీక్షా శిబిరంలోనే సంక్రాంతి పండుగ



దీక్షా శిబిరంలో నిరసన తెలియజేస్తూ పండుగను జరుపుకున్న రైతన్నలు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం వానగుట్టపల్లి, వి.మిట్టపల్లి గ్రామాల రైతులు గత ఎనిమిది రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. రైతుల నిరసన కార్యక్రమాలు సోమవారం నాడు 8వ రోజుకు చేరుకుంది. రైతులకు అతిపెద్ద పండుగ అయిన సంక్రాంతి పర్వదినాలలో సైతం రైతులు దీక్షను కొనసాగించడం పై పలువురు సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరం పొడుగునా రైతన్నలు కష్టపడి పండించిన పంట చేతి కందిన ఆనందంలో మూడు రోజులపాటు సంక్రాంతి పండుగను అత్యంత వైభవంగా జరుపుకోవాలని సాంప్రదాయంగా వస్తోంది. అయితే అందుకు భిన్నంగా వానగుట్టపల్లి, వి మిట్టపల్లి గ్రామాల రైతులు మాత్రం వారి పంట పొలాలను రక్షించుకోవడానికి పోరాడడం స్థానిక ప్రజలకు సైతం ఆవేదన కలిగిస్తోంది. సంక్రాంతి పర్వదినాలలో మొదటి రోజున భోగి పండుగను పురస్కరించుకొని ఆందోళన చేస్తున్న రైతులు దీక్షా శిబిరంలోనే భోగి మంటలు ఏర్పాటుచేసి తమ ఆవేదనను వెళ్లబుచ్చుకున్నారు. అనంతరం గోపూజ నిర్వహించి, తమ కష్టాలు తొలగించాలని గోమాతను వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కష్టాలను తిలకిస్తున్న ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడంతో మకర సంక్రాంతి పర్వదినాన ఆ దేవదేవుడికి తమ కష్టాలను వెళ్లబుచ్చుకున్నట్లు తెలిపారు. ఆ దేవుడైన కరుణించి, ప్రభుత్వ అధికారులలో తమపై కరుణ కలిగించి తమ కష్టాలను తొలగించాలని ప్రార్థించడం జరిగిందన్నారు.

యానాదులకు భూమి కేటాయించండి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు


ప్రజాశక్తి- బంగారుపాళ్యం : యానాదుల అవసరాల కోసం భూమి కేటాయించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని మొగిలి గ్రామంలో యానాదులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగిలి గ్రామంలోని ఊరగుట్టలో 59 ఎకరాల్లో సర్వే చేపట్టారని అందులో ఆక్రమణదారులు ఉన్నారని గుర్తించారని వాటిపై చర్యలు చేపట్టక పోగా యానాదులకు అవసరమైన పాఠశాల ఇండ్ల స్థలాలు, శ్మశాన వాటికలకు స్థలం కేటాయించకపోగా యానాదులు అనుభవంలో ఉన్న భూమిని ఇతరులకు ఆక్రమించుకుంటున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టున్నదని అన్నారు. దీన్ని అతిక్రమించి పోరాడాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు మురళి, తదితరులు పాల్గొన్నారు.



యానాదులతో మాట్లాడుతున్న గంగరాజు

కొండెక్కిన నిత్యావసరాలు

కళతప్పిన సంక్రాంతి



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సంక్రాంతి తెలుగువారి పెద్ద పండుగ. కొండెక్కిన నిత్యావసరాలు దిగనంటున్నాయ్.. కూరగాయలు, పప్పులు, వంట నూనె ఇలా అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేల సామాన్యుడికి అందుబాటులోకి తెస్తామంటూ ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన పార్టీలు తీరా గెలిచిన తరువాత నిత్యావసర ధరల తగ్గింపుపై ఏమాత్రం దృష్టి పెట్టకపోవడంతో పండుగపూట రుచికరమైన భోజనం చేసేందుకు పేద, మధ్య తరగతి జేబులు ఖాళీ అవుతున్నాయి.

స్థానిక మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా..

చిత్తూరులోని స్థానిక కూరగాయల మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. కిలో వంకాయ రూ.60, ముల్లంగి రూ.40, బీన్స్ రూ.60, బీట్‌రోట్ రూ.50, క్యాబేజి రూ.40, క్యారెట్ రూ.80 ఉల్లి రూ.50, వెల్లులి రూ.400 ఉండగా ఆకు కూరలలు కట్ట రూ.20లు ఇలా పెరిగిన కూరగాయల ధరలతో జనం సతమమౌతున్నారు. ఇక బియ్యం విషయాన్ని వస్తే సన్న బియ్యం రకం 25 కేజీలు రూ.2వేలు, వంట నూనెలు లీటరు రూ.200పై మాటే... బ్రాండెడ్ పేరిట దుస్తులు ఐదుగురున్న కుటుంబ సభ్యులకు సంక్రాంతికి కొనుగోలు చేయాలంటే రూ.6 నుండి 7వేలు ఖర్చు చేయాల్సిందే.. మరోవైపు ఆన్‌లైన్ బిజినెస్ ఊపందుకోవడంతో యువత ఆన్‌లైన్ వైపుకు పరుగులు తీయడం స్థానిక బట్టల దుకాణాల్లో యువత జాడ కనిపించడం లేదు. ఈ కోవలోనే ఎలక్ట్రానిక్ వస్తువులు ఆన్‌లైన్ బిజినెస్ జోరుగా సాగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఎలక్ట్రానిక్ వస్తువుల అమ్మకం దుకాణాలు మూసుకోవాల్సిందేనంటూ షోర్‌రూం యజమానులు వాపోతున్నారు.

ధరలు తగ్గవాయే... ఆదాయం పెరగాదాయే..

స్కీమ్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్టు కార్మికుల జీతాలు అంతతమాత్రమే.. నెలంతా పని చేసినా నెలాఖరుకు వచ్చేది రూ.15 నుంచి 18వేలు మాత్రమే. మార్కెట్ ధరలతో పోల్చితే వీరికి వచ్చే జీతం ఏ మాత్రం సరిపోవడం లేదు. పిల్లల చదువులు, ప్రయాణ ఖర్చులు, ఇంటి అద్దెలు, విద్యుత్ బిల్లులు ఇలా చెప్పుకుంటూ పోతే చాలీచాలని జీతాలతో నెట్టుకురావడం నల్లేరు మీద నడకలాంటిదే... నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు కోరుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే స్కీమ్ వర్కర్ల జీతాలు పెంచుతామని, కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ వాగ్దానాలు చేసిన ప్రభుత్వాలు ఆ తారువాత ఈ విషయం పట్టించుకోవడం మానేశాయనే చెప్పాలి.

వైభవంగా పశువుల పండుగ

- హుషారుగా పరుష పందేలు
- రంకెలేసిన కోడె గిత్తలు.. యువకుల బేజారు..

ప్రజాశక్తి-రామచంద్రపురం: 'పట్టుకో... పట్టుకో.. దమ్ముంటే నా కోడె గిత్తలను పట్టుకోండి' అంటూ.. రామచంద్రాపురం మండలంలోని అనుప్పల్లె లో సోమవారం పరుష పందేలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం సంక్రాంతి పర్వదినాలలో మొదటి రోజైన భోగి పండుగ రోజున రాష్ట్రంలో మొట్ట మొదట చంద్రగిరి నియోజకవర్గం అనుపల్లి లో నిర్వహించిన పశువుల పండుగతో రాష్ట్ర మొత్తం జల్లికట్టు ఉత్సవాలు ప్రారంభ మవుతాయి. అనుపల్లె గ్రామంలో కోడిగిత్తలు రంకెలతో యువకుల హుషారుతో జల్లికట్టు జోరుగా సాగింది. గ్రామం లో రైతు కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటున్న కోడె గిత్తలు, ఆవులను రైతులు వాటి కొమ్ములను నున్నగా చెక్కి, కొమ్ములకు రంగులు పూసి వాటిని శుభ్రంగా కడిగి పూజించారు. కోడెగిత్తల కొమ్ములకు చెక్క పలకలు, నూతన వస్త్రాలు, వేలాది రూపాయల పారితోషకం కట్టి ' నా కోడిగిత్తల పౌరషాన్ని చూడండి..' అంటూ వాటి యజమానులు 'మీ వల్ల అయితే పట్టుకోండి చూద్దాం ..'అంటూ యువతకు సవాల్ విసిరారు. కోడెగిత్తల కొమ్ములకు బంగారు, వెండి ఆభరణాలు , అభిమాన, రాజకీయ, సినీ నటుల ఫొటోలతో కూడిన చెక్క పలకలను కొమ్ములకు కట్టి దొడ్లో నుంచి పందేల బరిలోకి దించి, కోడె గిత్తలను డబ్బులు కొడుతూ బెదిరించి పరుగులెత్తించారు. అప్పటికే వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువత గుంపులు గుంపులుగా చేరి పశువులకు కట్టిన బంగారు వెండి ఆభరణాలు, నగదు, పలకలను చేజికిచ్చేందుకు పోటీపడ్డారు. పశువుల పాక నుండి బరిలోకి దించి కోడెగిత్తలు వెనక డప్పులు వాయిస్తూ వాటిని బెదరకొట్టగా అవి బెదిరి దూకుడుగా పరిగెత్తుతుండగా యువకులు పౌరుషంతో పశువులు, కోడిగిత్తల పట్టుకునేందుకు పరుగులు పెట్టి బహుమతులను గెలుచుకుంటూ ప్రేక్షకులకు చూపిస్తూ 'నేనే విజేతను' అంటూ యువకులు కేరింతలు వేశారు. ఈ పోటీలలో యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ పందేలను తిలకించేందుకు వచ్చిన జనంతో అనుపల్లి గ్రామం జనసంద్రమైంది. ఈ పరుష పందేలను తిలకించేందుకు దేశ విదేశాల నుండి, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చారు. మందు బాబుల ఆగడాలు మితిమీరాయి. పరుష పందేలకు విచ్చేసిన ప్రేక్షకులకు గ్రామానికి చెందిన తారాసి యశ్వంత్, బొడ్డు ముని ప్రసాద్‌లు అన్న పానీయాలు ఐదువేల మందికి పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛ నీయ సంఘుట నలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రజలపై మరో భారం!

- పెరగనున్న రిజిస్ట్రేషన్ ఫీజులు
- రియల్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం
- పారిశ్రామిక వాడలే ప్రధాన ఆదాయ వనరులు
- ఇప్పటికే ఛార్జీల భారం
- అదనమంటున్న వ్యాపారులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రభుత్వం నూతన సంవత్సర, సంక్రాంతి కానుకగా జనంపై కొత్త భారం వేసేందుకు సిద్ధమైంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల ఫీజును పెంచుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని పాలనా పరమైన ఉత్తర్వులను ఆయా శాఖల అధికారులకు అందిం చింది. భూములు, స్థలాలు, ఇళ్ల క్రయ, విక్రయాలపై రిజిస్ట్రేషన్ల భారం పడనుంది. కమర్షియల్ ఏరియాకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అదనపు ఛార్జీలు కొనుగోలు దారులు చెల్లించాల్సి వుంది. నూతన పాలసీ ప్రకారం భూముల విలువ 15 నుంచి 20 శాతం పెరగనుంది. పరిసర ప్రాంతాల్లో భారీగా భూముల ధరలు పెరిగాయి. వీటి పరిధిలో రియల్ ఎస్టేట్ రూపంలో అమ్మకాలు కూడా జోరుగానే సాగుతుంటాయి. కానీ, గత ఏడాది సార్వత్రిక ఎన్నికల అనంతరం జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామాల్లో కూడా భూముల క్రయవిక్రయాలు తగ్గాయి. ఇలాంటి తరుణంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా భూముల ధరలను మరింత పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు పట్టణాలు, గ్రామాల్లో ఒకేసారి కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు అమల్లోకి రానుంది. గత ప్రభుత్వ విధానంలో మాదిరిగా భూముల రిజిస్ట్రేషన్లలో అసమానతలు లేకుండా చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. నిర్ణయం ఏదైనా జనంపై మాత్రం భారం తప్పడం లేదు. భూముల రిజిస్ట్రేషన్లతో పాటు భవన నిర్మాణాల విలువను కూడా పెంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచనున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోని దాదాపు అన్ని భూములపై 15 నుంచి 20 శాతం ఛార్జీలు అదనంగా పెరగనున్నాయి.

మూడు గ్రూపులుగా వ్యవసాయ భూములు..

ఇప్పటి వరకు వ్యవసాయ భూములకు ఒకేవిధంగా రిజిస్ట్రేషన్ విలువ ఉండేది. ఈసారి వాటిని మూడు రకాలుగా వర్గీకరిస్తున్నాం. జిల్లాలో పండ్లు (మామిడి, నిమ్మ తదితరవి), పూల (మల్లె, బంతి, చామంతి) సాగు ఎక్కువగా ఉంటుంది. వీటిని గార్డెన్ కింద తొలి ప్రాధాన్యతగా తీసుకున్నాం. ఆ తర్వాత మాగాణి , మెట్ట భూములు, చివరగా మెట్ట (డ్రై) భూములను తీసుకుంటే మెట్ట విలువ సవరణలో గార్డెన్ మెట్ట, మాగాణి మధ్య వ్యత్యాసం ఉంటుంది. ఒక సర్వే నంబర్ వర్గీకరణ మారితే దానినే పరిగణలోకి తీసుకుంటారు పక్కన మాగాణి ధర మామూలుగానే ఉంటుంది. ఓ పది ఎకరాల వ్యవసాయ తోటలో 100 అంకణాల ఇల్లు నిర్మించుకొని ఉంటే గార్డెన్‌కు ఉండే విలువ రెసిడెన్షియల్ కంటే ఉండే విలువ వేరుగా ఉంటుంది.

కొన్నిచోట్ల 15 శాతం పెంపుదల ఇలా..

ప్రస్తుతం ఎకరా ధర రూ.20 లక్షలు ఉంటే, ఆ భూమిని బయట వ్యక్తులకు విక్రయిస్తే రిజిస్ట్రేషన్ ఫీజు 7 శాతం అంటే రూ.1.50 లక్షలు వసూలు చేస్తారు. రాబోయే కాలంలో 15 శాతం భూమి విలువ పెడితే ఈ ప్రాంతంలో ఎకరాకు రూ. లక్షలు చొప్పున పెరిగి, దాని విలువ రూ.23 లక్షలు అవుతుంది. ఈ విధంగా చూస్తే దీని పై రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 1,72,500 పడుతుంది. అంటే అదనంగా రూ. 22,550 వరకు కలిగి వుంది. ఇక కొనుగోళ్లపైనా దాదాపు అదే తరహాలో భారం పడనుంది.

పారిశ్రామిక వాడలే ప్రధానం...

తిరుపతి నగరంలో వాణిజ్య, మాస్టర్ ప్లాన్ రోడ్లున్న ప్రాంతాల్లో భూముల విలువలను సవరించాం. తిరుపతి రూరల్, రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, చంద్రగిరి మండలాల నుంచి 70 శాతం రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం వస్తుంది. మిగిలిన 30 శాతం ఇతర మండలాల నుంచి వస్తుంది. 70 శాతంలో కూడా తిరుపతి రూరల్, రేణిగుంట మండలాల నుంచి 55 శాతం ఆదాయం వస్తుంది. అందువల్ల ఈ మండలాలపైనే ఎక్కువగా దష్టి పెడుతున్నాం.

క్రయవిక్రయాలపై ప్రభావం

జిల్లాలో ప్రస్తుతం భూముల ధరలకు రెచ్చలొచ్చాయి. ఈ నేపథ్యంలో కొందరు వారి ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు పొలాలు, స్థలాలను అమ్మకాలు చేస్తుంటారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు తరచూ పెరుగుతుండటంతో ఆ ప్రభావం భూముల క్రయ విక్రయాలపై పడుతోంది. రిజిస్ట్రేషన్ ఛార్జీల భారంతో అమ్మకాలు బాగా తగ్గిపోతాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపుతో మరింత పతనం అవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. కరోనా ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రియల్ ఎస్టేట్ రంగం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు నిర్ణయంతో కుప్పకూలిపోయే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. భూముల విలువ, రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోరుతున్నారు.



తిరుపతిలో కొంత తగ్గింపు.. కొంత పెంపు



తిరుపతి నగరంలో అపార్టమెంట్ల విలువ పెంచలేదు. అదే విధంగా 19, 20 డివిజన్ల పరిధిలో ప్రస్తుతం ఆస్తుల విలువ ఎక్కువ గానే ఉండడంతో వాటిని కూడా సవరించలేదు. ఇక 1 నుంచి 17 డివిజన్ల వరకు చదరపు గజానికి వెయ్యి రూపాయలు, 21 నుంచి 23 డివిజన్లలో ప్రస్తుతం ఉన్న విలువకు 20 శాతం పెంచేందుకు ప్రతి పాదనలు సిద్ధం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు స్వీకరిస్తారు. కమిటీ ముందు పెట్టి రివిజన్ చేస్తారు.. తుది నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వమే..

- శ్రీరామ్ కుమార్, తిరుపతి జిల్లా సబ్ రిజిస్ట్రారు.

గోకులం షెడ్డు ప్రారంభం



ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం కంగుంది గ్రామంలో మినీ గోకులం షెడ్డును సోమవారం ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాడి రైతుల ప్రయోజనార్థం గోకులం షెడ్డు పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా అనేకమంది పేద పాడి రైతులు ప్రయోజనం పొందినట్లు తెలిపారు. పెద్ద పండుగ అయిన సంక్రాంతి మొదటిరోజు గోకులం షెడ్డును ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామ సర్పంచ్ సంపూర్ణ ధనశేఖర్, యూనిట్ ఇంచార్జ్ దివాకర్, పాడి రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని చొక్కా మడుగు క్రికెట్ ప్రీమియర్ లీగ్ సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ ఆర్గనైజర్ రూపేష్ మాట్లాడుతూ మానసిక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ టోర్నమెంట్ ఆర్గనైజర్లు చిరంజీవి, వెంకటేష్, మాట్లాడుతూ గ్రామీణ క్రీడాల్లో ఎక్కువ ప్రోత్సాహం కల్పించాలని తెలిపారు. దివాకర్, నవీన్ అరవింద్, బన్నీ సురేష్, పవన్ బాబి బాలాజీ, ఉదయ్, అజిత్, జ్యోతిబాబు, మునస్వామి, లక్ష్మీపతి, దివాకర్, నితీష్, మదన్, అర్జున్ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు టెండర్లు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: శివరాత్రి ఉత్సవాలకు టెండర్ల వేయాలని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆదివారం మునిరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల్లో ఆలయానికి సున్నం, కలర్లు వేయడానికి ఫిబ్రవరి 23వ తారీకు నుండి మార్చి 8వతేదీ వరకు జరుగు శివరాత్రి ఉత్సవాల్లో విద్యుత్ అలంకరణ, పందిళ్ళు, మంగళ వాయిద్యాలు, పూల అలంకరణ కార్యక్రమాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. టెండర్లు ఈనెల 17వ తేదీ లోపు కార్యాలయంలో లోయస్ట్ కొటేషన్‌తో ఉన్న టెండర్లకు పనులు అప్పజెప్పనున్నట్లు ఆసక్తి గలవారు టెండర్లు కొటేషన్ వేసి కార్యాలయంలో చేర్చాలన్నారు. అందులో లోయస్ట్ కొటేషన్ ఉన్న వారికి పనులు అప్పజెప్పబడుతుందన్నారు.

జిల్లా కార్యనిర్వహక కార్యదర్శిగా

అల్లాల విజయబాబు



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: చిత్తూరు వైసిపి జిల్లా కార్యనిర్వహక కార్యదర్శిగా ఎస్ఆర్‌పురం మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ బసివిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన మాజీ పుత్తూరు మార్కెటింగ్ డైరెక్టర్, జిల్లా కాపు సంఘ అధ్యక్షులు అల్లాల విజయబాబును నియమించినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు జిల్లా కార్యనిర్వహక కార్యదర్శిగా ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి జిల్లా అధ్యక్షులు కరుణాకర్ రెడ్డికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి నియోజకవర్గ ఇన్చార్జ్ కృపాలక్ష్మి, చిత్తూరు నియోజకవర్గ ఇన్చార్జ ఎంసి విజయనంద రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అనంత కుమార్‌కు సన్మానం



ప్రజాశక్తి- తవణంపల్లి: చిత్తూరు జిల్లా రచయితల సంఘం ఎం.వి కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ తరపున పలువురికి సేవా పురస్కారాలను ప్రధానం చేయడం జరిగింది. అలాగే మండలానికి చెందిన ఎ.అనంత కుమార్‌కు విద్య, సామాజిక, సేవా రంగంలో గత 20 ఏళ్ళుగా సమాజ శ్రేయస్సు కాంక్షించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విభిన్న రంగాల్లో విశిష్ట సేవలు అందించినందుకు వారిని గుర్తించి పురస్కారాన్ని అందించడం జరిగింది. అనంత కుమార్ మాట్లాడుతూ విద్య, సామాజిక సేవ జర్నలిజంలో తాను చేసిన సేవలను గుర్తించి ఎంవి కేశవరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి మనవడు ప్రముఖ పారిశ్రామికవేత్త, సుబ్రహ్మణ్యం శర్మ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఈపురస్కారాన్ని అందజేయడం జరిగిందన్నారు.

హెల్మెట్ తప్పనిసరి: ఎస్సై

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరు ఖచ్చితంగా పాటించాలని ఎస్సై పరశురాముడు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని, వారి కుటుంబాలు అనాథలుగా మిగులుతున్నారని ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడినప్పుడు వారి తల్లిదండ్రుల పైన కేసు నమోదు చేస్తామని, ముఖ్యంగా నెంబర్ ప్లేట్ లేకుండా కనిపించే వాహనాలు పట్టుబడినప్పుడు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనం నడిపినా, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయవద్దు అని, డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

30 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి)


తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తిరుపతి– పీలేరు మార్గమధ్యంలోని భాకరాపేట కనుమ రహదారి మొదటి మలుపులో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో రెండు బస్సులలో సుమారు 30మంది ప్రయాణికులు స్వల్ప గాయాలు పాలయ్యారు. మదనపల్లి నుండి తిరుపతికి వస్తున్న మదనపల్లి ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి పీలేరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మదనపల్లి ఆర్టీసీ బస్సు డ్రైవర్ క్యాబిన్లో ఇరుక్కోగా చంద్రగిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. క్యాబిన్లో ఇరుక్కుపోయిన ఆర్టీసీ డ్రైవర్‌ని పోలీసులు బయటకు తీశారు. ఈ ఘటనతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. చంద్రగిరి పోలీసులు రోడ్డు అడ్డంగా ఉన్న బస్సులు తొలగించి రాకపోకలను క్రమబద్ధీకరించారు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.



రంగులు లేక

కళావిహీనంగా బసవన్న

ప్రజాశక్తి- సోమల: ఎన్నో తరాల క్రితం గ్రామంలో కలరా వచ్చి గ్రామంలో ప్రజలు మరణిస్తూ ఉండడం, అప్పట్లో గ్రామస్తులు ఎక్కువ శాతం పశు సంపద పైనే ఆధారపడి ఉండడం పశువులకు వ్యాధులు రావడం అవి మరణించడం జరుగుతూ ఉండడంతో అప్పట్లో ప్రజలంతా ఒకటిగా చేరి గ్రామానికి తూర్పు దిశగా గంగమ్మను ప్రతిష్టించి ఆపై బసవన్న విగ్రహాన్ని తయారుచేసి ఏర్పాటు చేశారు. అప్పటినుండి గ్రామంలో ఎలాంటి అంటువ్యాధులు ప్రజలకు కానీ పశువులకు గాని సోకకుండా అమ్మవారు కాపాడుతూ వస్తోందని గ్రామప్రజలు అనుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా బసవన్న విగ్రహానికి రంగులు వేసి ఆపై రంగురంగుల కాగితాలను అలంకరించి ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దేవారు. అయితే గ్రామంలో ఎద్దులు లేకపోవడం పశువులు సంఖ్య కూడా పూర్తిగా తగ్గి పోవడంతో నాడు గ్రామాన్ని పశుసంపదను కాపాడిన బసవన్న విగ్రహానికి ఆదరణ కరువై కళావిహీనంగా తయారైంది. తరతరాలుగా వస్తున్న ఆచారాన్ని ఆధునికత పేరుతో అనగదొక్కి బసవన్నను కళావిహీనంగా ఉంచడంతో అటు గంగమ్మ ఇటు బసవన్న ఇరువురు ఆవేదనతో ప్రజల నిర్లక్ష్యంపై నిర్వేదం చెందుతున్నారు. ఇకనైనా బసవన్నకు, గంగ రాతి చుట్టూ ఏర్పాటుచేసిన రాతి స్తంభాలకు రంగులు దిద్ది నాటి ఆచారాలను అలవాట్లను కొనసాగించేలా చూడాలని నాటి పెద్దలు నేటి తరానికి సూచిస్తున్నారు.



రంగులు లేక కళావిహీనంగా ఉన్న బసవన్న విగ్రహం

వ్యాపారం కోసం మనోభావాలు దెబ్బతీస్తారా..

కుప్పం నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సంతోష్ కుమార్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: వ్యాపారం కొరకు వ్యక్తుల మనోభావాలు దెబ్బతీస్తారా అంటూ కుప్పం నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సత్యరాజ్ ధ్వజమెత్తారు. విశ్వబ్రాహ్మణ కులస్తులతో కలిసి వారు శ్రీ కుమరన్ జువెలర్స్ యాజమాన్యంపై కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలోని హొసూరు, క్రిష్ణగిరి నగరాలకు చెందిన శ్రీ కుమరన్ జువెలర్స్ వ్యాపార ప్రకటనలో భాగంగా ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని క్యాలెండర్లు ముద్రించి కుప్పం పట్టణంలో పంచడం జరిగిందన్నారు. ఈ క్యాలెండర్ల పై పంచాంగ ముద్రణలో భాగంగా విశ్వబ్రాహ్మణ కులస్తుడు ఎదురుపడితే ఆ శుభం అంటూ ముద్రించడం పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణ కులస్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించిన శ్రీ కుమరన్ జువెలర్స్ యాజమాన్యం పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



మాదిగ పల్లెలు తరలిరావాలి

ఎమ్మార్పీఎస్ కుప్పం నియోజకవర్గ అధ్యక్షులు రాజకుమార్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగ పల్లెలు తరలి రావాలని, ప్రజాసంఘాలు తమకు సహకరించాలని నియోజకవర్గ అధ్యక్షులు రాజకుమార్ పత్రికా ముఖంగా కోరారు. సోమవారం కుప్పం పట్టణంలోని రాజావారి పార్కులోని కమ్యూనిటీ భవనంలో వారు పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డు రామకృష్ణ మాదిగ, చిత్తూరు జిల్లా అధ్యక్షులు ప్రకాష్ మాదిగలు మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన తరగతులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్న సదుద్దేశంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించినట్టు తెలిపారు. కొన్ని కారణాల చేత రాజ్యాంగ ఫలితాలను కొందరు అనుభవించలేక పోతున్నారని, అందులో మాదిగ కులస్తులు ముందు ఉన్నట్టు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతోనే ఎస్సీ ఉపకులాలు రాజ్యాంగ పలాలను అందుకుంటుందని గుర్తించిన మందకృష్ణ మాదిగ పోరాటం ప్రారంభించినట్టు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా ఆయన వెంట దేశవ్యాప్తంగా మాదిగ కులాలు చేసిన పోరాట ఫలితంగా నేడు ఎస్సీ వర్గీకరణ ఆచరణలోనికి వస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం ఏక సభ్య కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కమిటీ జనవరి 21వ తేదీన చిత్తూరు జిల్లాలో తమ కార్యచరణను నిర్వహిస్తున్నారని, ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగ పల్లెలు తరలివచ్చి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తమ వాణి వినిపించాలని కోరారు. జిల్లాలోని రాజకీయ్య పార్టీలు, ప్రజాసంఘాలు, కుల సంఘాలు ప్రతి ఒక్కరు కలిసి వచ్చి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వినతిపత్రాలను అందజేసి సహకరించాలని కోరారు. రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డు రామకృష్ణ మాదిగ, జిల్లా అధ్యక్షులు ప్రకాష్ మాదిగ, కుప్పం మండల అధ్యక్షులు మురుగేష్ పాల్గొన్నారు.



క్రైం న్యూస్

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లె సమీపంలో నంజంపేట గ్రామానికి చెందిన వెంకటరమణ (65) అనే మతిస్థిమితం లేని వ్యక్తి సోమవారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో మృతి చెంది ఉండగా గ్రామస్తులు గుర్తించి సోషల్ మీడియాలో మృతుడి ఫోటోలను వైరల్ చేశారు. దీంతో ఫోటోలోని వ్యక్తిని నంజంపేట గొల్లవీధికి చెందిన వెంకటరమణగా గుర్తించారు. ఇతనికి మతిస్థిమితం లేదని ఎప్పుడూ ఎక్కడంటే అక్కడ వెళుతూ ఉంటారని ఆరోగ్యం కూడా సరిగా లేదని అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని సమాచారం. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



మృతి చెంది ఉన్న వెంకటరమణ

CHANGE OF NAME

I, MOHAN RAJA (Old Name), S/0 Late Narayana Swami, mother Late Krishamma residing at D.No.4-54, Padmavathi Nagar, Tagguvaripalli Village, Bangaru palyam Mandal, Chittoor District, AP hereby declare that I have changed my name as AVALA MOHAN RAJA (New Name) for all future purposes.

THE COURT OF THE CIVIL JUDGE [SENIOR DIVISION] PILER
HMOP.NO.71/2024

Between
C.Suchitra, W/o. C.Om Prakash Reddy, D/o.P.Bhaskar Reddy ...**PETITIONER**
And
C.Om Prakash Reddy s/o.C.Reddappa Reddy ...**RESPONDENT**

NOTICE TO RESPONDENT

C.Om Prakash Reddy s/o.C.Reddappa Reddy, Residing at Puttavari Palli, Village,Valli Gatla post, Somala Mandal, Chittoor Dist.

Sir,

Please take Notice that the above case in HMOP.NO.71/2024 is Posted for your appearance on 28-1-2025 at 10:30 am before the Honourble civil Judge [Senior Division] either in person or through your council , otherwise the matter will be decided as exparty.

V.KRISHNA REDDY,
C.N.DINAKAR REDDY,
ADVOCATES,
TIRUPATHI/PILER.